మూసీ రోడ్డుకు మోక్షమెప్పుడో !

- కాసనగోడు నుంచి ప్రాజెక్టు వరకు అధ్వానంగా రహదారి
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, పర్యాటకులు



కేతేపల్లి శివారులో గుంతలు పడి అధ్వానంగా మారిన మూసీ రోడ్డు



గురుకుల పాఠశాల వద్ద బురదమయంగా మారిన మూసీ రోడ్డు

కేతేపల్లి : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత అతి పెద్ద సాగునీటి వనరుగా పేరు గాంచిన మూసీ ప్రాజెక్టు వద్దకు కేతేపల్లి నుంచి వెళ్లేందుకు ఉన్న ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఈ రహదారి ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో పరిసర గ్రామాల ప్రజలు, ప్రాజెక్టును వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. కేతేపల్లిలోని 65 నంబర్ జాతీయ రహదారి నుంచి మూసీ కుడి ప్రధాన కాల్వ వెంట కొత్తపేట, కాసనగోడు, బొప్పారం గ్రామాల మీదుగా ప్రాజెక్టు వరకు ఉన్న దారి 13 కి.మీ దారి గతంలో మట్టి రోడ్డుగా ఉండేది. వర్షాకాలంలో ఈ రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి కనీసం నడవడానికి కూడా వీలుకాని పరిస్థితి ఉండేది. పదేళ్ల క్రితం కేతేపల్లి నుంచి 10 కి.మీ. దూరంలో ఉన్న కాసనగోడు శివారు వరకు మూసీ కుడి కాల్వవెంట బీటీ రోడ్డు నిర్మించారు. అక్కడి నుంచి మూసీ ప్రాజెక్టు వరకు గల మూడు 3 కిలోమీటర్లకు పైగా ఉన్న మట్టి రోడ్డును అలాగే వదిలేశారు. నాటి నుంచి మట్టిరోడ్డు నిర్వహణను పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. మోకాలి లోతు గుంతలు ఏర్పడి పడావుగా మారింది. కేతేపల్లి నుంచి కాసనగోడు శివారు వరకు పదేళ్ల క్రితం వేసిన బీటీ రోడ్డు సైతం నిర్వహణ లేకపోవడంతో గుంతలు పడి ధ్వంసమయింది.

కాల్వ కట్టే రోడ్డు మార్గం..

కాసనగోడు గ్రామం నుంచి మూసీ ప్రాజెక్టు వరకు రోడ్డు సక్రమంగా లేకపోవడంతో మూసీ కుడి కాల్వ కట్టపై నుంచే ప్రమాదకర పరిస్థితుల్లో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. కాసనగోడు, బొప్పారం గ్రామాల రైతులు ప్రాజెక్టు సమీపంలో ఉన్న తమ వ్యవసాయ భూముల వద్దకు వెళ్లాలంటే ఈ కట్టపై నుంచే వెళ్లాలి. రైతులు తమ ధాన్యాన్ని ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ద్వారా ఇళ్లకు తరలించేందుకు ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరదలు వచ్చి మూసీగేట్లు ఎత్తిన సమయంలో కేతేపల్లి నుంచి ప్రాజెక్టు వద్ద విధులు నిర్వహించే సిబ్బంది, అధికారులు, పర్యాటకుల బాధలు అన్నీ ఇన్నీ కావు. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లే పరిస్థితి ఉండదు. కాసనగోడు నుంచి ప్రాజెక్టు వరకు నడక దారే శరణ్యంగా మారింది.

గురుకుల విద్యార్థులకు ఇబ్బందే..

మూసీ ప్రాజెక్టు వరకు రోడ్డు మార్గం లేకపోవడంతో ప్రాజెకు వద్ద ఉన్న జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. ఈ పాఠశాలలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలలోని వివిధ ప్రాంతాలకు చెందిన 300 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల వరకు బీటీ రోడ్డు మార్గం లేకపోవడంతో వాహనాల రాక విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడికి వచ్చే వారు ప్రత్యేకంగా వాహనాలు కిరాయికి మాట్లాడుకుని రావాల్సి వస్తోంది.

శంకుస్థాపనకే పరిమితం

కేతేపల్లి నుంచి కాసనగోడు శివారు వరకు 10 కిలోమీటర్ల వరకు అధ్వానంగా మారిన రోడ్డును అభివృద్ధి చేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎంఆర్ఎఫ్ నిధుల నుంచి రూ.1.17 కోట్లు మంజూరు చేసింది. 2023 అగస్టులో అప్పటి ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేసినప్పటికీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. అనంతరం ప్రభుత్వం మారినా ఈరోడ్డును ఎవరూ పట్టించకోవడం లేదు. పాలకులు స్పందించి మూసీ ప్రాజెక్టు వరకు బీటీ రోడ్డు నిర్మించి బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులు కేటాయించాలి



వర్షాకాలంలో రోడ్డుపై గుంతల్లో నీరు చేరడంతో లోతు తెలియక ప్రమాదాల బారిన పడుతున్నాం. రాత్రి వేళ రోడ్డుపై ప్రయాణించాలంటే నరక యాతన అనుభవిస్తున్నాం. గుంతల దారి గుండా నిత్యం రాకపోకలు సాగిస్తుండటంతో వాహనాలు త్వరగా దెబ్బ తింటున్నాయి. ప్రభుత్వం మూసీ రోడ్డు మరమ్మతులకు అవసరమైన నిధులను కేటాయించి పనులు పూర్తి చేయాలి.

–భద్రయ్య, కొత్తపేట

ప్రతిపాదనలు పంపించాం

రోడ్ల మరమ్మతులకు గతంలో మంజూరైన నిధులకు సంబంధించి టెండరు ఖరారు చేయడంలో ఆలస్యం కావడంతో నిధులు రద్దయ్యాయి. మూసీ ప్రాజెక్టు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం అంచనాలు రూపొందించి మరోసారి ప్రభుత్వానికి పంపించాం. ప్రభుత్వం నుంచి ఇంకా నిధులు మంజూరు కాలేదు. నిధులు మంజూరు కాగానే బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తాము.

–సంపత్, పీఆర్ ఏఈ, కేతేపల్లి

శాశ్వత రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తా

- ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మర్రిగూడ : శివన్నగూడెం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సమీపంలో ఉన్న శ్రీ నీలకంఠ రామస్వామి ఆలయానికి శాశ్వత రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తానని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆ ఆలయ కమిటీ చైర్మన్ రాపోలు యాదగిరి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు మార్గంతో పాటు, బ్రిడ్జి నిర్మాణానికి తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు.అనంతరం మండలంలోని ఖుదాభక్షపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త బుచ్చాల పాండురంగయ్య ఇటీవల మృతిచెందగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ మేతరి యాదయ్య, దేవాలయ ధర్మకర్తలు చిట్యాల రంగారెడ్డి, ముడిగ నరసింహాయాదవ్, నరసింహ, అయితగోని వెంకటయ్యగౌడ్, పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే

చండూరు : స్థానిక మున్సిపాలిటీ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కాళికాదేవి బోనాల ఉత్సవంలో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. బోనమెత్తిన మహిళలతో ఆప్యాయంగా ముచ్చటించారు. బోనాలతో వస్తున్న సమయంలో బస్సుల్లో వెళ్తున్న వారికి కరచాలనం, అభివాదం చేస్తూ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు.వేదపండితులు శివప్రసాద్ ఎమ్మెల్యేకు ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం బోనాలు సమర్పించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్‌గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దోటి సుజాత వెంకటేశ్, నాయకులు కోడి శ్రీనివాసులు, బ్రహ్మం, తదితర నాయకులు పాల్గొన్నారు.



చండూరు : బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

పాపన్నగౌడ్ ఆశయ సాధనకు కృషిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్నగౌడ్

నల్లగొండ టూటౌన్: సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధనకు కృషి చేయాలని గౌడ అఫీషియల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) జిల్లా అధ్యక్షుడు దంతూరి సైదులుగౌడ్ అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని అసోసియేషన్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గోపా 50వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగుల సహాయకులకు అల్పాహార వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఐతగాని లాల్‌బహదూర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నేలపట్ల శ్రీధర్‌గౌడ్, కోశాధికారి పోలగాని వెంకటేశ్వర్లుగౌడ్, నర్సింగ్ వెంకటేశ్వర్లుగౌడ్, శ్రీనయ్యగౌడ్, జెర్రిపోతుల శంకర్‌గౌడ్, వెంకన్నగౌడ్ పాల్గొన్నారు.

చిట్యాల : బహుజన రాజ్యవిస్తరణ నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధనకు బహుజనులంతా కృషి చేయాలని గోపా(గౌడ్స్ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండి సాయన్నగౌడ్ కోరారు. చిట్యాలలో ఆదివారం నిర్వహించి ఆ సంఘం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దంతూరి సైదులుగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి యలిమకంటి మీరయ్య గౌడ్, సాయి వేణుగౌడ్, రమేష్‌గౌడ్, పాల్గొన్నారు.

క్లుప్తంగా

తైక్వాండో క్రీడాకారులకు బెల్టులు ప్రదానం

చిట్యాల : పట్టణానికి చెందిన పలువురు తైక్వాండో క్రీడాకారులు ఆదివారం యాద్రాద్రి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో నిర్వహించిన కలర్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చి బెల్టులు ప్రదానం చేశారు. ఈ టెస్ట్‌లో ముగ్గురు ఎల్లోబెల్ట్, నలుగురు ఎల్లో వన్ బెల్ట్, ముగ్గురు గ్రీన్ బెల్ట్, ముగ్గురు గ్రీన్ వన్ బెల్ట్, ముగ్గురు బ్లూ బెల్ట్, ఇద్దరు బ్లూ వన్ బెల్ట్‌లు సాధించగా వారికి బెల్ట్‌లను రామన్నపేట ఎస్ఐ నాగరాజు అందజేసి అభినందించారు. ఎగ్జామినర్‌గా పట్టేడ సుధాకర్ వ్యవహరించగా కోచ్ ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు.

కట్టంగూర్ వాసికి డాక్టరేట్



ఇల్లెందుల సంతోష్

కట్టంగూర్ : మండల కేంద్రానికి చెందిన ఇల్లెందుల సంతోష్ ఫార్మసీ రంగంలో డాక్టరేట్ లభించింది. జైపూర్‌లోని శ్యామ్ యూనివర్సిటీలో ప్రొఫెసర్ శైలేష్ శర్మ పర్యవేక్షణలో వైరస్, కేన్సర్ నిరోధక ఔషధాల నిర్ధారణపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ దక్కింది. ప్రస్తుతం సంతోష్ హైదరాబాదులోని ప్రముఖ ఫార్మసీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సంతోష్ డాక్టరేట్ పొందటంపై తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యం స్నేహితులు అభినందించారు.

ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా రాఘవరెడ్డి



పన్నాల రాఘవరెడ్డి

నకిరేకల్ : పట్టణంలో స్థానిక ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా పట్టణానికి చెందిన పన్నాల రాఘవరెడ్డి నియామకయ్యారు. స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజిత అధికారికంగా ఆదివారం అధికారికంగా ప్రకటించారు.

ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి

నల్లగొండ టౌన్ : ఆశా వర్కర్లకు కేంద్ర ప్రభుత్వం ఫిక్స్‌డ్ వేతనం అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండలోని దొడ్డి కొమురయ్య భవన్‌లో ఆ సంఘం జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆశాలకు ఒకే జాబ్ చార్ట్ ఉండాలన్నారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షురాలు డి మహేశ్వర, సీఐటీయూ జిల్లా నాయకులు సైదులు, వెంకటమ్మ, అనూష, సుజాత, పార్వతమ్మ, సౌజన్య, సునీత, వసంత, స్వర్ణ, పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కథల పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

చిట్యాల : మండలంలోని గుండ్రాంపల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని కూరాకుల భావన రాష్ట్ర స్థాయి కథల పోటీల్లో ఉత్తమ ప్రతిభను చాటింది. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో బాలసాహిత్య పీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి కథల పోటీల్లో భావన రాసిన 'నాన్న కష్టం' కథ ప్రోత్సాహక బహుమతికి ఎంపికైంది. దీంతో ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో నిర్వహించిన కార్యక్రమంలో భావనకు నగదు బహుమతితో పాటు చందమామ కథల పుస్తకాలను, మెమెంటోను దక్షిణ భారత నేషనల్ బుక్ ట్రస్ట్ చైర్మన్, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డాక్టర్.పత్తిపాక మోహన్, బాల సాహితీవేత్తలు, కేంద్ర సాహిత్య అకాడమి గ్రహీతలు దాసరి వెంకటరమణ, చొక్కారపు వెంకటరమణ, సీనియర్ బాలసాహితీ వేత్తలు బెర్లె నాగేశ్వరావు, ఆకెళ్ల వెంకటసుబ్బలక్ష్మీ అందజేశారు. ఈ సందర్భంగా గుండ్రాంపల్లి పాఠశాలలోని పలువురు విద్యార్థులను కథ రచయితలుగా తీర్చిదిద్దుతున్న ఆ పాఠశాల ఉపాధ్యాయురాలు డాక్టర్ ఉప్పల పద్మను గుండ్రాంపల్లి గ్రామస్తులు అభినందించారు.

చెర్వుగట్టు దేవస్థానానికి స్టాండ్ అందజేత

నార్కట్‌పల్లి : మండలంలోని చెర్వుగట్టు గ్రామంలోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థాన అన్నదాన సత్రానికి భోజనాలు వడ్డించే స్టాండ్‌ను ఎల్లారెడ్డిగూడెంకు చెందిన ఐదుగురు విరాళంగా అందజేశారు. నిత్యం అన్నదానం చేసే సమయంలో సిబ్బందికి, భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు స్టాండ్‌ను స్నేహితుల దినోత్సవం సందర్భంగా అందజేసినట్లు తెలిపారు. విరాళం అందజేసిన వారిలో పట్ల లింగయ్య, వడ్డె శ్రీనివాస్‌రెడ్డి, కమటాల స్వామి, బొడ్డుపల్లి శ్రీహరి, వడ్డె శివశంకర్‌రెడ్డిలు ఉన్నారు. విరాళం అందించిన మిత్ర బృందానికి ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి కండువాలతో సత్కరించారు.



ఆలయ సిబ్బందికి స్టాండ్ అందజేస్తున్న స్నేహితులు

ఘనంగా ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు

నకిరేకల్ : వేముల వీరేశం పుష్ప మిత్ర మండలి ఆధ్వర్యంలో నకిరేకల్‌లో ఆదివారం రాత్రి స్థానిక లక్ష్మీనారాయణరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఫ్రెండ్‌షిప్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ స్నేహం విలువ కట్టలేనిదని, ఎంత స్థాయికి ఎదిగినా చిన్ననాటి స్నేహితులను, పుట్టిన ఊరును, కన్నతల్లిదండ్రులను మరిచిపోవదన్నారు. అనంతరం ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లను ఎమ్మెల్యేకు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫైనాన్స్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితా శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, నార్కట్‌పల్లి మాజీ జెడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య, పీఆర్‌టీయూ జిల్లా నేత సుంకరి బిక్షంగౌడ్, ఎవీఎం విద్యాసంస్థల అదినేత కందాల పాపిరెడ్డి, ఎమ్మెల్యే సతీమణి వేముల పుష్ప, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తండ్రి వాసుదేవరెడ్డి, నాయకులు లింగాల వెంకన్న, పన్నాల రాఘవరెడ్డి, కొండ వెంకన్న, గాదగోని కొండయ్య, యాసా కరుణాకర్‌రెడ్డి, నారయణరెడ్డి, గాజుల సుకన్య శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ఫ్రెండ్‌షిప్ డే వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



శాలిగౌరారంలో మొక్క నాటుతున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

శాలిగౌరారం : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని శాలిగౌరారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గుజిలాల్ శేఖర్‌బాబు అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలుచోట్ల మొక్కలు నాటి మాట్లాడారు. మొక్కలు నాటడంతో పర్యావరణం రక్షించబడుతుందన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరూ తమవంతు మొక్కలు నాటి వాటిని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆక్లబ్ జోనల్ చైర్మన్ బుడిగె శ్రీనివాసులు, గ్యాట్ ప్రతినిధి ఎర్ర శంభులింగారెడ్డి, ప్రతినిధులు గుండు పరమేశ్, దామెర్ల శ్రీనివాస్, దునుక వెంకన్న, చామల మహేందర్‌రెడ్డి, రామడుగు వెంకట్రామశర్మ, మారోజు వెంకటాచారి, గుండ్ల రాంమ్మూర్తి, మురారిశెట్టి కరుణాకర్, బట్ట సైదులు, కప్పల శ్రీకాంత్, పడాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాలు అభివృద్ధి

చిట్యాల : కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తూ కేటాయిస్తున్న కోట్లాది రూపాయల నిధులతోనే గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు నూకల వెంకటన్‌నారాయణ్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం వనిపాకల గ్రామంలో ఆదివారం ×ఇంటింటికి బీజేపీ≈ మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలతో కూడిన ప్రచార కరపత్రాలను ఇంటింటికి ఆయన అందజేశారు. ఆనంతరం ఆయన మాట్లాడారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు పీకె వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల ప్రధానకార్యదర్శులు పున్న విష్ణు, గరిషె నరేష్, పోలింగ్ బూత్ అధ్యక్షులు పీకె మహేష్, గంట మల్లేష్, నాయకులు శివకోటి ప్రవీణ్, ఆకుల వెంకన్న, పెద్దబోయిన అశోక్, మల్లేబోయిన సతీష్, పీకే నరేష్, యాదయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కట్టంగూర్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని బీజేపీ మండల అధ్యక్షుడు నీలం నాగరాజు గౌడ్ అన్నారు. ఆదివారం కట్టంగూర్‌లో మండల బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు నీలం నాగరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు పబ్బు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి బసవోజు వినోద్‌కుమార్, ఐతగోని శివ, చెరుకు నాగరాజు, అంతటి రాజు, సుంకరబోయిన నవీన్ ఉన్నారు.

బీజేపీతోనే పేదరిక నిర్మూలన

మునుగోడు : బీజేపీ పరిపాలనలోనే దేశంలోని పేదరికం పూర్తిగా నిర్మూలన జరుగుతుందని, గత 11ఏళ్లుగా పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందించి పేదరిక నిర్మూలనకు కృషి చేస్తుందని ఆపార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనం వేణు కుమార్ అన్నారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం మునుగోడులో గ్రామ సౌభాగ్యం బీజేపీ తోనే సాధ్యం అనే నినాదంతో పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య, నాయకులు భవనం మధుసూదన్ రెడ్డి, మాదగోని నరేందర్ గౌడ్, పోలే వెంకటేశ్వర్లు, పందుల యాదయ్య, కొత్త శంకర్, కారింగు అనిల్, స్వామి, పాల్గొన్నారు.

తిప్పర్తి : మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె బాబా పాల్గొని మాట్లాడారు. మహాసంపర్క్ అభియాన్‌లో భాగంగా తిప్పర్తిలో 'ఇంటింటికి బీజేపీ' కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. నరేంద్రమోదీ పథకాలను వివరించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అబద్ధ హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికల ముందు హామీలు అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం వెంకట్‌రెడ్డి,వంగూరి రవి,వడ్డే శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్ ,మైనం మల్లయ్య, బిక్షం, శివశంకర్, బాలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

నకిరేకల్ : మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ నకిరేకల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వివిధ బూతుల్లో ఇంటింటికి వెళ్లి కేంద్ర పథకాలపై వివరించిర కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే చందుపట్ల గ్రామంలోనూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రచురించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ నకిరేకల్ పట్టణ అధ్యక్షుడు గర్రె మురళి మోహన్, నాయకులు పందాల సైదులు, చినేని జాని, నడికుడి సైదులు, కారింగుల యాదగిరి, నడికుడి నవీన్, పార్టీ మండలం అధ్యక్షుడు బుడిగె సైదులు, బూత్ అధ్యక్షుడు నవీన్ సాయి, నాయకులు యానాల శ్రీనివాస్‌రెడ్డి, గుడుగుంట్ల సాయన్న, ఉప్పల నాగరాజు, దొడ్డోని శంకర్, తాటికొండ రామూర్తి, రాచురి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల : వనిపాకలలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



కట్టంగూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నకిరేకల్‌లో ఎగ్జిబిషన్ ప్రారంభం

నకిరేకల్ : పట్టణంలోని మూసీ రోడ్డులో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆదివారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్‌లోని వివిధ ప్రదర్శనలో రంగుల రాట్నం , తదితర వాటిల్లో ఆయన చిన్నారులతో కలిసి సరదాగా కొద్ది సేపు చక్కర్లు కొట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ చౌగోని రజిత, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, స్థానిక వార్డు కౌన్సిలర్ రాచకొండ సునీల్, నాయకులు గాదగోని కొండయ్య పాల్గొన్నారు.



చిన్నారితో కలిసి ఎగ్జిబిషన్‌లో ఎమ్మెల్యే వీరేశం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నల్లగొండ: పట్టణంలోని బొట్టుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004- 05 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం కలిసి భోజనం చేశారు. తమ గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇందిర, సుదర్శన్ రెడ్డి, యాదగిరి రెడ్డి, నిర్మల్ రెడ్డి, వెంకటేష్, శర్మ, పూర్వ విద్యార్థులు మస్న వేణు, శివ, ప్రభాకర్, సైదా, కవిత తదితరులు పాల్గొన్నారు.

వైన్స్ సిబ్బందిపై దాడి

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

శాలిగౌరారం : ఓ వైన్స్ సిబ్బందిపై ఓ రాజకీయ పార్టీ మండల అధ్యక్షుడు దాడి చేసిన సంఘటన శాలిగౌరారం మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం .. శాలిగౌరారం బీజేపీ మండల అధ్యక్షుడు తోట వినోత్ స్థానిక మద్యం షాపులో మద్యం సేవించి ఆ షాపు యజమానుల ఫోన్ నంబర్లు ఇవ్వాలని సిబ్బంది బట్ట సైదులు, అనిల్‌కుమార్‌అను అడిగాడు. దీంతో వారు తమకు తెలియదు. తాము ఇవ్వకూడదని చెప్పారు. దీంతో ఆగ్రహానికి గురైన వినోద్ ఫోన్ నంబర్లు ఎందుకు చెప్పరంటూ వైన్స్ షాపులో ఉన్న ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన స్థానిక సిబ్బంది సైదులు, అనిల్‌కుమార్‌లను కులం పేరుతో దూషిస్తూ దాడి చేసి గాయపరిచాడు. దాడి ఘటన మొత్తం సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. ఈ నేపథ్యంలో బాధితుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వినోద్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ వివరించారు. ఇదిలా ఉండగా వైన్స్ సిబ్బందిపై దాడి జరిగిన విషయాన్ని తెలుసుకున్న స్థానిక ఎస్సీలు అధిక సంఖ్యలో పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకొని దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలంటూ ఆందోళన నిర్వహించారు.



దాడిలో గాయపడిన వైన్స్ సిబ్బంది

ఆర్థిక సాయం అందజేత

చిట్యాల: మున్సిపాలిటిలోని శివనేనిగూడెంకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు నాయకుడు రుద్రవరం మహేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబాన్ని సీపీఎం నాయకులు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఆదివారం పరామర్శించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సాయాన్ని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, మున్సిపాలిటి కార్యదర్శి బొబ్బల సుధాకర్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు చొప్పరి మల్లేశం, అర్జున్, యాదయ్య, స్వామి, శ్రీనివాస్‌రెడ్డి, స్వామి, పాల్గొన్నారు.

తిప్పర్తి : మండలంలోని మామిడాల గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు తోటీ స్నేహితుడు రాంబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయ పడ్డాడు. దీంతో స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం రాంబాబుకు రూ.17వేలను ఆర్థిక సాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్, ప్రవీణ్, నగేష్, చాంద్‌పాష, పరుశు రాములు, సైదులు, అర్జున్, శేఖర్, ఎర్రయ్య

శాలిగౌరారం : మండలంలోని ఎన్‌జీ కొత్తపల్లిలో ఇటీవల మృతిచెందిన నిరుపేద కుటుంబానికి చెందిన రాపోలు యాదమ్మ ఇటీవల మృతిచెందింది. ఆమె కుమార్తెకు జాతీయ మానవ హక్కుల మండలి జిల్లా కన్వీనర్ వీపూరి పరాంకుశం రూ.20వేలు నగదు, క్వింటా బియ్యం మృతురాలి కుమార్తెకు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రఘు, పరమేశ్, సైదులు, దావీదు, పరమేశ్ పాల్గొన్నారు.



శాలిగౌరారం : ఆర్థిక సాయం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు



తిప్పర్తి : మామిడాలలో స్నేహితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న తోటి మిత్రులు

ప్రారంభోత్సవానికి సిద్ధం



క్లాక్ టవర్ సెంటర్‌లో సోమవారం ప్రారంభించనున్న మంత్రి క్యాంపు కార్యాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించిన దృశ్యం

-సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ